క్లుప్తంగా

ఖాజీకి సన్మానం


సదుం: ఖాజీని సన్మానిస్తున్న ముస్లింలు

సదుం: ఇటీవల మండల ప్రభుత్వ ఖాజీగా నియమితులైన సయ్యద్ సైఫుల్లాసిరాజ్‌ను జామియా మసీద్ మతవల్లి సాదిక్, అబ్దుల్ రషీద్ మంగళవారం గొడ్లవారిపల్లె మదరసాలో ఘనంగా సన్మానించారు. ఖాజీ నియామకానికి కృషి చేసిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సయ్యద్‌బాషా, మైనారిటీ నాయకులు ఖాజాపీర్, ఖమ్రుద్దీన్, కాలేషా, అంజాద్ తదితరులు పాల్గొన్నారు.

విరూపాక్షి మారెమ్మకు ప్రత్యేక పూజలు



పుంగనూరు: పట్టణంలోని బస్టాండ్ వద్ద ఉన్న విరూపాక్షి మారెమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి విశేషాలంకరణ చేసి, పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి నెయ్యిదీపాలు, చలిపిండి, పెరుగన్నం నైవేద్యం పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థప్రసాదాలు అందజేశారు.

పాఠశాల స్థలం కాపాడాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న జయప్ప

రామకుప్పం: మండలకేంద్రంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన 11 సెంట్ల స్థలం కాపాడాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఆరేళ్ల జయప్ప మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ కాలేష్‌కు వినతిపత్రం అందజేశారు. సదరు స్థలం అన్యాక్రాంతం అవుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మెయిన్ రోడ్డుకు ఆనుకుని రూ.కోట్ల విలువ చేసే పాఠశాల స్థలం కబ్జాకు గురికాకుండా కాపాడాలని రెవెన్యూ అధికారులను కోరారు. ఈ విషయాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.


కరాటేలో మదర్ థెరిస్సా విద్యార్థుల ప్రతిభ



షీల్డు చూపుతున్న రవీంద్ర బాబు


పెద్దపంజాణి: గౌరీ బిదనూరులో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మదర్ థెరిస్సా సీబీఎస్‌ఈ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ ఎం. రవీంద్ర బాబు తెలిపారు. ఈ పోటీల్లో 32 ప్రథమ, 24 ద్వితీయ, 18 తృతీయ స్థానాలను విద్యార్థులు సాధించినట్లు పేర్కొన్నారు. వీటితో పాటు ఓవరాల్ చాంపియన్ షిప్ కైవసం చేసుకున్నట్లు చెప్పారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సభలో ఆయన విద్యార్థులను అభినందించారు. పాఠశాల డైరెక్టర్ కుమారి శ్రేయ, డీన్ మధుసూదన్ రెడ్డి, ప్రిన్సిపల్ అరుల్ రాజ్, కరాటే మాస్టర్ సదాశివ పాల్గొన్నారు.

మెనూ పాటించాలి


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీవైఈఓ కృష్ణప్ప

సోమల: ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్నభోజనంలో మెనూ తప్పక పాటిస్తూ, రుచికరమైన భోజనం వడ్డించాలని మదనపల్లె డీవైఈఓ కృష్ణప్ప అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతోపాటు ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజన రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఎంఈఓ కేశవపిళ్లై, హెచ్‌ఎం శివరత్నమ్మ పాల్గొన్నారు.

నూరుల్లాకు డాక్టరేట్



పుంగనూరు: ఉర్దూ సాహిత్యంపై ప్రత్యేక పరిశోధన చేసిన షేక్ నూరుల్లాకు మంగళవారం డాక్టరేట్ ప్రదానం చేశారు. చౌడేపల్లె మండలం దాదేపల్లెకు చెందిన షేక్‌నూరుల్లా మద్రాస్ విశ్వవిద్యాలయంలో గైడ్ ప్రొఫెసర్ ఖాజీ హబీబ్ అహమ్మద్ ఆధ్వర్యంలో అరబిక్, పర్సియన్ సాహిత్యంపై ప్రత్యేక పరిశోధనలు చేసి, పత్రాలు సమర్పించినందుకు డాక్టరేట్ అందజేశారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

కుప్పంరూరల్: ఆరోగ్యమే మహాభాగ్యమని ఎస్.కొత్తపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి సుభాష్‌రాజ్ అన్నారు. మంగళవారం ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఎస్.కొత్తపల్లె పాఠశాల విద్యార్థులతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాష్ రాజ్ మాట్లాడుతూ ప్రస్తుతంలో జనం డబ్బుపై వ్యామోహంతో ఆరోగ్యాన్ని మరిచారన్నారు. బైకులు, కార్లు రావడంతో మనిషికి వ్యాయామమే లేకుండా పోయిందన్నారు. దీంతో అనేక రోగాల భారీన పడి అర్ధాయుష్కులుగా మిగిలిపోతున్నారని చెప్పారు. వ్యాయామం చేయడం ద్వారా ఏకాగ్రత, పట్టుదల, శరీర దారుఢ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని చెప్పారు. విద్యార్థులు చిన్నతనంలోనే వ్యాయామంపై మక్కువ పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది డాక్టర్ అనూషా, షీనా, ముత్తుకుమార్, కోమల పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఉల్లాసం..ఆరోగ్యం

పులిచెర్ల(కల్లూరు): సైక్లింగ్‌తో ప్రతి ఒక్కరికీ ఆరోగ్యంతోపాటు ఉల్లాసం కలుగుతుందని ఎంఈఓ సిద్ధరామయ్య తెలిపారు. ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా సైకిల్ తొక్కండి–ఆరోగ్యంగా ఉండండి అనే నినాదంతో మంగళవారం కల్లూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో సైకిల్ ర్యాలీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యానికి రోజు అరగంట సైకిల్ తొక్కాలన్నారు. మనిషి అనేక రుగ్మతలతో నిత్యం బాధపడుతున్నాడని, వాటిని అధిగమించడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కల్లూరు ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డి, వైద్యాధికారి జానకీరావు, హెచ్‌ఎం తాతయ్య, పీసీ చైర్మన్ రఫీ, వెంకటసిద్దులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి సైకిల్ తొక్కాలి

రొంపిచెర్ల: ఆరోగ్యంగా ఉండాలంటే అందరూ సైకిల్ తొక్కాలని పీహెచ్‌సీ డాక్టర్ దినేష్ కుమార్‌నాయక్ అన్నారు. ఆయన మంగళవారం రొంపిచెర్లలో సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ కొంతసేపు సైకిల్ తొక్కడంతో శరీరక దృఢత్వంతోపాటు మానసిక ఒత్తిడి తగ్గుతుందన్నారు. శరీరంలో ఉన్న కేలరీలు కరుగుతాయన్నారు. కేన్సర్, గుండె జబ్బులు, చక్కెర వ్యాధి, థైరాయిడ్, అధిక రక్తపోటు కూడా రాకుండా అదుపులో పెట్టుకోవచ్చన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని సైకిల్ తొక్కడం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఎంఈఓ హసన్‌బాషా, కేజీబీవీ ప్రత్యేకాధికారి సుజాత, హెచ్‌ఎం లక్ష్మీదేవి, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి పాల్గొన్నారు.


రొంపిచెర్లలో సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ దినేష్ కుమార్ నాయక్


సదుం: ర్యాలీలో పాల్గొన్న ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు

సైక్లింగ్‌పై అవగాహన ర్యాలీ

సదుం: కేన్సర్ నియంత్రణకు సైక్లింగ్ ఉపయోగపడుతుందని చెరుకువారిపల్లె పీహెచ్‌సీ డాక్టరు చరణ్ తెలిపారు. మండల కేంద్రంలో సైక్లింగ్‌పై అవగాహన ర్యాలీ మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఫజురుల్లా, హెల్త్ సూపర్‌వైజర్లు ఉదయ భాస్కర్, నీలకంఠ, పీడీ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం

శాంతిపురం: సైకిల్ తొక్కడంతో శారీరక వ్యాయామం కలిగి ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని మండల వైద్యాధికారి డాక్టర్ వంశీకృష్ణ చెప్పారు. మంగళవారం కెనమాకుపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో మెగా సైకిల్‌థాన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజాఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ ఆదేశాల మేరకు సైక్లింగ్‌తో కలిగే లాభాలను విద్యార్థులకు వివరిస్తున్నామని చెప్పారు.ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ లతీఫ్‌ఖాన్, సూపరింటెండెంట్ కోదండపాణి, హెచ్‌ఎం మునిరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ పూజ, ఏఎన్‌ఎం గ్రీటా పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో శారీరక దృఢత్వం

బైరెడ్డిపల్లె: సైక్లింగ్‌తో శారీరక దృఢత్వం చేకూరుతుందని వైద్యాధికారి విజయ్‌చంద్ర అన్నారు. బైరెడ్డిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజూ కొంతసేపు సైక్లింగ్ చేయడం వలన శారీరక దృఢంత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ, హెచ్‌ఎం విశ్వనాథ్ పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో దేహదారుఢ్యం

పెద్దపంజాణి: సైక్లింగ్‌తో దేహదారుఢ్యం, మానసికోల్లాసం కలిగి తద్వారా విద్యను అభ్యసించడంలో చురుకుగా ఉంటారని ఎంఈఓ హేమలత తెలిపారు. మంగళవారం పెద్దవెలగటూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా సైకిల్‌థాన్ ఈవెంట్‌లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రవి పాల్గొన్నారు.

మెగా సైకిల్‌థాన్

సోమల: మండలంలోని సోమల,పెద్ద ఉప్పరపల్లె పీహెచ్‌సీల పరిధిలో వైద్యాధికారులు శివప్రసాద్, రమ్యశ్రీ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులతో కలిసి మెగాసైకిల్ థాన్ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సైక్లింగ్‌తో పలు ప్రయోజనాలున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది అమరనాథ్, రహీమా, చిన్నప్ప, ఆంజనేయులు, హేమలత, అమరావతి, చంద్రమ్మ పాల్గొన్నారు.


కల్లూరులో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది


రొంపిచెర్లలో ర్యాలీ


బైరెడ్డిపల్లెలో..


పెద్దపంజాణిలో..

వెట్టిచాకిరి నిర్మూలనకు సహకరించండి


మాట్లాడుతున్న న్యాయమూర్తి వాసుదేవరావు

పుంగనూరు: సమాజంలో అనేక ప్రాంతాల్లో పలువురు వెట్టిచాకిరికి గురవుతున్నారని, వారికి విముక్తి కల్పించి, ఆ వ్యవస్థ నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవరావు పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం మున్సిపాలిటీలో వెట్టిచాకిరి నిర్మూలనపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి వాసుదేవరావు మాట్లాడుతూ అమాయకులైన ప్రజలు తమ అవసరాల కోసం చేసిన అప్పులను తీర్చలేక ధనికుల వద్ద వెట్టిచాకిరికి చేస్తున్నారన్నారు. అలాగే ప్రకృతి వైపరీత్యాల్లో తల్లిదండ్రులను కోల్పోయిన వారి పిల్లలు కూడా వెట్టిచాకిరికి గురవుతున్నారన్నారు. ముఖ్యంగా అవసరాలకు కోసం అప్పులు చేసి , ఖాళీ ప్రామిసరీ నోట్లలో సంతకాలు చేయకూడదన్నారు. తీసుకున్న మొత్తాన్ని అందులో నమోదు చేసి ,ప్రామిసరీ నోట్లలో సంతకాలు చేయాలని సూచించారు. అలాగే ఇటుక బటీలు, ఫ్యాక్టరీల్లో ఎంతో మంది కార్మికులు వెట్టిచాకిరికి గురవుతున్నారని సూచించారు. ఇలాంటి వారిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ రసూల్‌ఖాన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటసుబ్బయ్య, న్యాయవాది వీరమోహన్‌రెడ్డి , మున్సిపల్ కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో యువత జీవితం చిత్తు



ద్రవిడ వర్సిటీ ప్రాంగణంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

కుప్పం: మాదక ద్రవ్యలతో యువత జీవితాలను నాశనం చేసుకుంటుందని ద్రవిడ యూనివర్సిటీ రిజిస్ట్రార్ వేణుగోపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం వర్సిటీ ప్రాంగణంలో డ్రగ్స్ రహిత దిశగా ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలసి ర్యాలీ చేశారు. విద్యార్థులు ఫ్యాషన్ కోసం సిగరెట్లు, మద్యం అలవాటు చేసుకుని, అనంతరం వాటికి బానిసలవుతున్నారని చెప్పారు. మాదక ద్రవ్యాలకు ఒకసారి అలవాటు పడితే జీవితాంతం వ్యసనాలకు బానిసై అనారోగ్యంతో క్షీణించాల్సి వస్తోందన్నారు. ఇలాంటి అలవాట్లుకు యువత దూరంగా ఉండి, ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ లోకనాథం, యశోద, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అన్వేషణ్ ప్రాజెక్టు-23లో పలమనేరు విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

పలమనేరు: అగస్త్య ఇంటర్నేషల్ ఫౌండేషన్, సైనోప్సెస్ కంపెనీ సంయుక్తంగా హైదరాబాద్‌లో నిర్వహించిన అన్వేషణ్-2023లో భాగంగా ఏర్పాటు చేసిన సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ఫెయిర్‌లో పలమనేరు విద్యార్థులు శైలశ్రీ , గీత, జయశ్రీ , లోహిత్ ప్రతిభ కనబరిచారు. వీరు జోనల్ స్థాయిలో రెండో స్థానం, జాతీయస్థాయిలో ఐదో స్థానంలో నిలిచినట్టు మదర్‌థెరీసా ఇంజినీరింగ్ కళాశాల నిర్వాహకులు రవీంద్రబాబు తెలిపారు. కంప్యూటర్ మౌస్‌ను ఉపయోగించకుండా కేవలం చేతిలో గుర్తులతో కంప్యూటర్‌ను వాడడం వర్చువల్ మౌస్ సిస్టం ప్రాజెక్టును వీరు ప్రదర్శించి అవార్డు అందుకున్నారు. మరో వైపు గంగవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు హర్షిత, మనిత సైతం ఈ ప్రాజెక్టులో సహాయకులుగా పనిచేసి ప్రతిభను చాటారు. దీంతో బహుమతులు సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు, చైర్మన్ సునీల్, అకడమిక్ అడ్వైజర్ రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపల్ రవీంద్రారెడ్డి, అధ్యాపకులు శ్రీరామమూర్తి, కుసుమలు స్థానిక కళాశాలలో విద్యార్థులను అభినందించారు.

ఎక్స్‌ప్రెస్ సర్వీసులు పునరుద్ధరించాలి

పలమనేరు: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి గతంలో వివిధ ప్రాంతాలకు నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ సర్వీసులను పునరుద్ధరించాలని పలమనేరు పరిరక్షణ సమితి సభ్యులు మంగళవారం స్థానిక ఆర్టీసీ డీఎం రామకృష్ణకు వినతిపత్రం అందజేవారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్ష, కార్యదర్శులు సుబ్రమణ్యంపిళ్లై, నరసింహులు మాట్లాడుతూ గతంలో ఇక్కడి నుంచి పలు ప్రాంతాలకు నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ బస్సులను పక్క డిపోలకు ఎందుకు పంపించారో చెప్పాలన్నారు. గతంలో పలమనేరు నుంచి ఉదయం పూట తిరుపతి, వేలూరుకు బస్సులుండేవన్నారు. దీంతో స్విమ్స్, రుయా, వేలూరు సీఎంసీలకు వెళ్లే రోగులకు అనుకూలంగా ఉండేదన్నారు. ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు, విజయవాడకు నడుస్తున్న బస్సులను నష్టాలొస్తున్నాయని ఆపేశారన్నారు. అయితే ఇదే పలమనేరు నుంచి విజయవాడకు, హైదరాబాద్‌కు వెళుతున్న ప్రైవేటు బస్సులకు మాత్రం లాభాలు ఎలా వస్తున్నాయో ఆర్టీసీ అధికారు లు విచారించాలన్నారు. విన్నవించిన వారిలో దేవరాజులు,దొరస్వామి, సన్నీరాజు,నారాయణప్ప,రమణ ఉన్నారు.

ఉన్నత పాఠశాల సందర్శన


కొళాయిలు ధ్వంసం ఘటనపై ఆరా తీస్తున్న అధికారులు

చౌడేపల్లె: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను ఎంపీడీఓ సుధాకర్, ఎంఈఓ కేశవరెడ్డి, పంచాయతీ ఈఓ సుధాకర్‌రావు తదితర అధికారుల బృందం మంగళవారం సందర్శించింది. గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాలలో తాగునీటి కొళాయిలను ధ్వంసం చేసిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ క్రమంలో వారు పాఠశాలలో తనిఖీలు చేశారు. ధ్వంసమైన కొళాయిలను మరమ్మతు చేయించారు. ఆకతాయిలు, మద్యంప్రియులు పాఠశాల ప్రాంగణంలో సంచరిస్తున్నట్లు గుర్తించారు. రాత్రిపూట పోలీసులు గస్తీ సమయంలో పాఠశాల వైపు నిఘా పెట్టేలా చూడాలని ఎస్ఐ రవికుమార్‌కు సూచించారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు

పలమనేరు: ప్రభుత్వ సంక్షేమ పథకాలను వలంటీర్లతో కలసి ప్రతి గడపకు తీసుకెళ్లి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలును వారికి గుర్తు చేస్తామని సోషల్ మీడియా కన్వీనర్లుగా నియమితులైన కన్వీనర్లు వైఎం వెంకటేష్, ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వారు స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం వద్ద మాట్లాడుతూ తమపై ఉంచిన బాధ్యతను కోకన్వీనర్లతో కలసి తప్పకుండా నెరవేర్చుతామన్నారు. ప్రభుత్వం చేస్తున్న మేలును కాకుండా తప్పుడు ప్రచారం చేస్తున్న వారికి దిమ్మతిరిగేలా వాస్తవాలను జనంలోకి తీసుకెళ్లడమే తమ లక్ష్యమన్నారు.

నేడు మండల మీట్

పులిచెర్ల(కల్లూరు): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, ఎంపీడీఓ సుగుణమ్మ తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని తెలిపారు.

18న శివరాత్రి వేడుకలు

సదుం: స్థానిక సుబ్రమణ్యస్వామి ఆలయ ఆవరణలోని అభీష్టమృత్యుంజయ మరకత లింగేశ్వర స్వామి ఆలయంలో 18న శివరాత్రి వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం పంచామృతాభిషేకం, రాత్రి రుద్రాభిషేకం, లింగోద్భవం, మహామంగళహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సచివాలయాల తనిఖీ

సోమల: మండలంలోని కందూరు, వల్లిగట్ల సచివాలయాలను మంగళవారం ఎంపీడీఓ నాగరాజ తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులతో పాటు సిబ్బంది హాజరు, బయోమెట్రిక్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు జైశంకర్, సునీత, లోకేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ మౌక్తిక తదితరులు పాల్గొన్నారు.

పక్కా ఇళ్ల లబ్ధిదారులకు రుణాలు

రొంపిచెర్ల: పక్కాఇళ్ల లబ్దిదారులకు స్వయం సహాయక సంఘాల్లో రుణాలు మంజూరు చేస్తున్నట్లు ఎంపీడీఓ రాజేంద్ర అన్నారు. ఆయన మోటుమల్లెల పంచాయతీలో ఇళ్ల నిర్మాణాలు చేసుకుంటున్న లబ్ధిదారులకు రూ.50 వేలు నుంచి రూ.70 వేలు వరకు రుణాలు ఇస్తున్నామని తెలిపారు. ఉగాది నాటికి పక్కాఇళ్ల పనులను పూర్తి చేసి గృహప్రవేశాలు చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం బ్రహ్మానందరెడ్డి, హౌసింగ్ ఏఈ యోగానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగజాతర

గుడుపల్లె: మండలంలోని యామగానిపల్లెలో సోమవారం రాత్రి గంగ జాతర ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలోని ఊరి గంగమాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని అన్ని అమ్మవార్ల ఆలయాల వద్ద విద్యుద్దీపాలంకరణ చేశారు. మంగళవారం ఉదయం అమ్మవారికి నైవేద్యం పెట్టి, పూజలు చేసి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

పంచాయతీకి రూ.48 వేలు ఆదాయం


వేలం పాటల నిర్వహిస్తున్న అధికారులు

సోమల: చేపల చెరువుల వేలం ద్వారా ఎస్ నడింపల్లె పంచాయతీకి రూ.48,800 ఆదాయం వచ్చినట్లు ఈఓపీఆర్డీ ఎస్ఏ గఫూర్‌సాహెబ్ తెలిపారు. మంగళవారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ వెంకటరమణ ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించామన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికే కృషి చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న నాగభూషణం

పుంగనూరు: వైఎస్సార్ సీపీ విధి విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీని పటిష్టం చేసేందుకు గృహసారథులు కృషి చేయాలని రాష్ట్రజానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం సూచించారు. మంగళవారం మున్సిపాలిటీలో గృహసారథుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. చైర్మన్ అలీమ్‌బాషా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మంత్రి పెద్దిరెడ్డి పీఏ చంద్రహాస్, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము అతిథులుగా హాజరయ్యారు. నాగభూషణం మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచనల మేరకు పార్టీలో క్రమశిక్షణగా పని చేసే వారికే గృహసారథులు, కన్వీనర్ల పదవులు ఇచ్చారన్నారు. 50 గృహాలకు సంబంధించి ఆయా గృహసారథులు పార్టీని పటిష్టం చేసేందుకు ప్రతి ఇంటికీ వెళ్లాలన్నారు. ఇంట్లోని సభ్యులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, వైఎస్సార్ సీపీ ఆశయాలను వివరించి చైతన్య పరచాలన్నారు. పార్టీని పటిష్టం చేసేందుకు గృహసారథులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు నాగేంద్ర, లలిత, వరదారెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆవుల అమరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలో ఉండాలి


మాట్లాడుతున్న ఎంఈఓ సిద్ధరామయ్య

పులిచెర్ల(కల్లూరు): బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని ఎంఈఓ సిద్ధరామయ్య తెలిపారు. పులిచెర్ల ఎమ్మార్సీలో మంగళవారం పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు తమ పాఠశాల పరిధిలోని గ్రామాల్లో బడికి రాని బడిఈడు పిల్లలను గుర్తించి, వారి తల్లిదండ్రులతో మాట్లాడి బడిలో చేరేలా చూడాలన్నారు. రాబోవు విద్యా సంవత్సరం బడి తెరిచే సమయానికి గుర్తించిన పిల్లలందరూ బడిలో చేరేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు తాతయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అందరూ చదువుకోవాలి

సోమల: బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని ప్రతి ఒక్కరూ చదువుకోవాలని తహసీల్దార్ శ్యాంప్రసాద్ రెడ్డి అన్నారు.మంగళవారం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ చేశారు. ఎంఈఓ కేశవ పిళ్లై, హెచ్‌ఎం శివరత్నమ్మ, ఉపాధ్యాయులు సోమశేఖర్, నారాయణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలి



మద్యం తనిఖీ చేస్తున్న సబ్‌ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ శాస్త్రి

రొంపిచెర్ల: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలని చిత్తూరు మద్యం డిపో సబ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణశాస్త్రి అన్నారు. ఆయన మంగళవారం రొంపిచెర్లలోని మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం విక్రయించే ముందు బాటిళ్ల స్టిక్కర్లు స్కాన్ చేసి ఇవ్వాలన్నారు. ప్రతిరోజూ మద్యం విక్రయం ద్వారా వచ్చిన నగదును మరుసటి రోజు బ్యాంక్‌లో జమ చేయాలన్నారు. రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. హెడ్‌కానిస్టేబుళ్లు నాగరాజ, లోకనాథ, సూపర్‌వైజర్లు సూరేషా, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బైజూస్ టీమ్ తనిఖీ

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బైజూస్ రాష్ట్ర బృందం సభ్యులు సతీష్‌బాబు, తులసి మంగళవారం తనిఖీలు చేపట్టారు. జగనన్న విద్యాదీవెన ద్వారా విద్యార్థులకు పంపిణీ చేసిన ట్యాబ్‌లను ఎలా వాడుతున్నారని గమనించారు. ఇందుకు సంబంధించి పాఠశాల హెచ్‌ఎం, టీచర్లతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులు ట్యాబ్ ద్వారానే ఎక్కువగా ప్రాక్టీస్ చేసేలా చూడాలన్నారు. పరీక్షలను సైతం ట్యాబ్స్ ద్వారానే నిర్వహించాలని సూచించారు. ట్యాబ్‌ల్లో ఏదేనా సమస్యలుంటే డీఈఓ కార్యాలయంలో సంప్రదించి, మార్చుకోవడం లేదా సమస్యలను పరిష్కరించుకోవచ్చని సూచించారు. ఈ సమావేశంలో ఎంఈఓ లీలా రాణి, సీఆర్పీలు పాల్గొన్నారు.

నిరాశ్రయులను ఆదుకుంటాం


సమావేశంలో పాల్గొన్న పెద్దిరెడ్డి

పుంగనూరు: పుంగమ్మచెరువు ఆక్రమణల తొలగింపులో ఇళ్లు కోల్పోయిన వారందరినీ అన్ని విధాలుగా ఆదుకుంటామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తెలిపారు. మంగళవారం ఇళ్లు కోల్పోయిన 16 మంది నిరాశ్రయులతో కమిషనర్ నరసింహప్రసాద్ రెడ్డి, చైర్మన్ అలీమ్‌బాషా, రాష్ట్రజానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణంతో కలసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి ఆదేశాల మేరకు నిరాశ్రయులందరికీ పునరావాసం కల్పించి, అన్ని సౌకర్యాలు ఏర్పాటు కల్పిస్తామన్నారు. అలాగే ఒక్కొక్కరికి రూ.5 లక్షలు విలువ చేసే ఇంటి స్థలంతోపాటు రూ.1.80 లక్షలతో ఇళ్లు నిర్మించి ఇస్తామని తెలిపారు. ఆక్రమణల తొలగింపుపై ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నాగేంద్ర, వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, కౌన్సిలర్ భారతి తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళి


అమర వీరులకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

పులిచెర్ల(కల్లూరు): జమ్మూ–కాశ్మీర్ సమీపం పుల్వామా వద్ద జరిగిన తీవ్రవాదులు దాడిలో మృతి చెందిన మన సైనికులకు మంగళవారం కల్లూరు లయన్స్‌క్లబ్, వీఆర్‌ఆర్ కళాశాల విద్యార్థులు కొవ్వొత్తులు వెలిగించి, నివాళులర్పించారు. జిల్లా లయన్స్ క్రీడావిభాగం అధ్యక్షుడు మహమ్మదాలీ మాట్లాడుతూ దేశ సేవకోసం తమ ప్రాణాలర్పించిన వారి త్యాగాలను మరువలేమన్నారు. కళాశాల కరస్పాండెంట్ సురేష్ పాల్గొన్నారు.